





# కరపత్రం

SINCE 2014

మంగళవారం నవంబర్ 26 2024 సంపుటి :0 సంచిక : 48 - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ పేజీలు: 4


## ఆర్థిక క్రమశిక్షణతో ఒక్కో హామీ నెరవేరుస్తున్నాం: మంత్రి పొన్నం

»మహారాష్ట్ర ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమిపాలైందని మాజీ మంత్రి హరీశ్‌రావు సంబర పడుతున్నారా? భాజపా గెలిచిందని సంతోషపడుతున్నారా? అని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రశ్నించారు.

2లో



## కామారెడ్డి డిక్లరేషన్‌ను యథాతథంగా అమలు చేయాలి: ఎమ్మెల్సీ కవిత

»బీసీ రిజర్వేషన్లకు సంబంధించి కామారెడ్డి డిక్లరేషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం యథాతథంగా అమలు చేయాలని భారాస ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు.



2లో

సీఎం రేవంత్ రెడ్డి ప్రకటన

# అదానీ రూ.100 కోట్ల విరాళాన్ని తిరస్కరిస్తున్నాం



»అదానీ వ్యవహారంలో గత కొన్ని రోజులుగా దుమారం కొనసాగుతోన్న వేళ తెలంగాణ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది.

హైదరాబాద్: అదానీ గ్రూప్‌పై లంచాల విమర్శల నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీకి ఇటీవల అదానీ గ్రూప్ ప్రకటించిన రూ.100 కోట్ల విరాళాన్ని స్వీకరించరాదని నిర్ణయించింది. ఈ విషయాన్ని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి మీడియా సమావేశంలో వెల్లడించారు. ఆ గ్రూప్‌పై విమర్శల దృష్ట్యా అదానీ ఫౌండేషన్ నుంచి విరాళాన్ని తీసుకోవడం లేదని స్పష్టం చేశారు. ఈ మేరకు ఆ అదానీ గ్రూపునకు లేఖ పంపినట్లు సీఎం వెల్లడించారు.

### అనవసర వివాదాల్లోకి ప్రభుత్వాన్ని లాగొద్దు

"అదానీ విషయంలో కొన్ని రోజులుగా దేశ వ్యాప్తంగా చర్చలు జరుగుతున్నాయి. అదానీ నుంచి తెలంగాణ ప్రభుత్వం నిధులు స్వీకరించిందని కొందరు విమర్శలు చేస్తున్నారు.

2లో




## డైరెక్టర్ రాంగోపాల్ వర్మ అరెస్టుకు రంగం సిద్ధం



ప్రముఖ దర్శకుడు రాంగోపాల్ వర్మ అరెస్ట్‌కు రంగం సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ ఫోటోలు మార్ఫింగ్ చేసి ఎక్స్‌లో పోస్ట్ చేసిన కేసులో రాంగోపాల్ వర్మ విచారణ ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే.

2లో

## వేములవాడ రాజన్నకు పోటెత్తిన భక్తులు



2లో

# సీఎం రేవంత్‌రెడ్డికి రోజులు దగ్గరపడ్డాయి



## కేటీఆర్‌కు ఘన స్వాగతం



»మహారాష్ట్రలో తగిన బుద్ధి చెప్పారు

»రాళ్లలో కొడతామంటే పోలీసులు ఏం చేస్తున్నారు

»బీఆర్ఎస్ మీదే కేసులా... కాంగ్రెస్ మీద కేసులుండవా.?

»మహబూబాబాద్ మహాధర్నాలో మాజీ మంత్రి కేటీఆర్ ధ్వజం

అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన సీఎం రేవంత్‌రెడ్డికి రోజులు దగ్గర పడ్డాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. గిరిజన, దళిత, పేద రైతులకు మద్దతుగా మహబూబాబాద్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన మహాధర్నాలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. మహారాష్ట్రకు పోయి కూడా ఆడబిడ్డలను మోసం చేసే ప్రయత్నం చేస్తే అక్కడి ఆడబిడ్డలు బుద్ధి చెప్పారని తెలిపారు. వీడు పచ్చి లంగా, తెలంగాణలో ఆడబిడ్డలను మోసం చేశాడని చైతన్యం ప్రదర్శించి తన్ని తన్ని తరిమేశారని పేర్కొన్నారు. నేను ఇక్కడ వస్తుంటే కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రాళ్లతో కొడతమని అంటున్నారని కేటీఆర్ తెలిపారు. నేను డీజీపీ, ఎస్పీ గారిని అడుగుతున్నా.. రాళ్లతో కొడతామంటే పోలీసులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. కేసులు మా మీద మాత్రమే పెడుతారా? కాంగ్రెస్ ఎమ్మెల్యేల మీద కేసులు ఉండవా? అని నిలదీశారు. మా గిరిజన రైతుల కోసం కదులుతూ మానుకోటలో ధర్నా చేస్తామంటే లగచర్లలో జరిగిన సంఘటనకు మానుకోటలో ధర్నా ఎందుకు అని డీజీపీ ప్రశ్నించారని తెలిపారు. కొడంగల్ రైతుల కోసం ఒక్క మానుకోటలోనే కాదు రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో ఎక్కడెక్కడ దళితులు, బీసీలు, గిరిజనులు ఉన్నారో అక్కడ ధర్నా చేస్తామని స్పష్టం చేశారు. సన్నకారు, బక్క చిక్కిన రైతులతో పెట్టుకున్న ఈ రేవంత్ రెడ్డికి తప్పకుండా బుద్ధి చెప్పే సమయం వస్తుందని కేటీఆర్ స్పష్టం చేశారు. .రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని కూకటి వేళ్లతో పెకిలించే దాకా వదిలిపెట్టమని చెప్పారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు రాళ్లతో కొడతామంటే, పెట్రోల్ పోస్తామంటే భయపడమని కేటీఆర్ అన్నారు. మేము కేసీఆర్ తయారు చేసిన దళం.. భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. మానుకోట రాళ్ల మహత్యం ఏందో తెలంగాణను అడ్డుకున్న వాళ్లందరికీ తెలుసని అన్నారు. మానుకోటలో 14 ఏళ్ల క్రితమే నిప్పు పుట్టి ఆ తర్వాత తెలంగాణ వచ్చిందని అన్నారు.

2లో

లగచర్లలో దళిత, గిరిజన రైతులపై రాష్ట్ర ప్రభుత్వం అమానుషంగా వ్యవహరించిన తీరును నిరసిస్తూ మహబూబాబాద్ జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ మహాధర్నా నిర్వహిస్తున్నది. ఈ కార్యక్రమానికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. సోమవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు ధర్నా నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో కేటీఆర్ రోడ్డుమార్గాన మానుకోటకు బయల్దేరారు. యాదాద్రి భువనగిరి జిల్లా కొత్తగూడెం ఎక్స్ రోడ్స్ వద్ద మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు, కార్యకర్తలు కేటీఆర్‌కు ఘనంగా స్వాగతం పలికారు. ముందుగా ఈ నెల 21న మహాధర్నా నిర్వహించాలని పార్టీ తలపెట్టినా, కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులపై ఒత్తిడి తెచ్చి అనుమతి నిరాకరించేలా చేసింది. దీంతో జిల్లా నేతలు హైకోర్టును ఆశ్రయించి ఈనెల 25న మహా ధర్నా నిర్వహించేందుకు అనుమతి పొందారు. ఈ ధర్నాకు ముఖ్యఅతిథిగా బీఆర్ఎస్ వరింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరుకానుండటంతో బీఆర్ఎస్ నాయకులు మానుకోటలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట భారీ ఏర్పాట్లు చేశారు.

# సంపాదకీయం

## మాతృత్వాన్ని కమ్మిన కట్టుకథలను ఛేదించే 'యోధ'

పితృస్వామ్య సమాజం మాతృత్వాన్ని చాలా గ్లోరిఫై చేసింది. పిల్లలను కనడం వేరు, మాతృత్వం వేరు. కానీ సమాజం ఈ రెండిటినీ ఒకే కోణంలో చూస్తుంది. పిల్లలను కనడానికి అనువుగా స్త్రీకి ఉన్న శారీరక నిర్మాణాన్ని అలుసుగా తీసుకున్న పురుషుడు పిల్లలను పెంచే బాధ్యతను కూడా స్త్రీ పైన మోపాడు. ఆడపిల్ల పెరుగుతున్న క్రమంలోనే మాతృత్వం లోని గ్లోరిఫికేషన్ వలన తనకు తెలియకుండానే పిల్లలను కనడంతోపాటు వాళ్ళను పెంచడం కూడా తన బాధ్యతగా భావిస్తుంది. చాలామంది స్త్రీలు పిల్లల పెంపకం బాధ్యత తమదే అని అనుకోవడానికి ఈ కండిషనింగ్ కారణం. ఇలాంటి నేపథ్యంలో మాతృత్వం కాన్సెప్ట్ మీద భండారు విజయ తన సంపాదకత్వంలో 'యోధ' పేరిట ఒక కథా సంకలనాన్ని తీసుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆమెతో ముఖాముఖి.

రచయిత అయిన మీకు ప్రచురణ రంగంలోకి రావాలన్న ఆలోచన ఎలా వచ్చింది?

ప్రథమంగా నేను రచయితను. ఒక మహిళా రచయితగా సమాజంలో వివక్షకు గురౌతున్న స్త్రీల పట్ల ఒక లోతైన అధ్యయనం చేస్తూ ఉంటాను. అలాగే మహిళా హక్కుల కార్యకర్తగా స్త్రీలను అనేక విషయాలలో ఎడ్యుకేట్ చేయాలన్న దృఢ సంకల్పం నాకు ఉంది. చిన్నప్పటి నుంచి నాకు ఇతర స్త్రీల కన్నా భిన్నంగా, కొత్తగా ఏదైనా ప్రయోగాలు చేయడం అంటే చాలా ఇష్టం. ఆ భిన్న వ్యక్తీకరణ నుంచి వచ్చిందే ఈ ప్రచురణ కర్త హెూదా. ఒకప్పుడు రచయితలు రాసిన ఏ పుస్తకాలనైనా ప్రచురించాలంటే ప్రముఖ ప్రచురణ సంస్థలు చాలా ఉండేవి. అలాంటి పేరున్న సంస్థలు ఇప్పుడు ఎక్కడా కనబడటం లేదు. కొత్తగా కొన్ని ప్రచురణ సంస్థలు వచ్చినప్పటికి, వాటికి కొన్ని పరిమితులు (ఆర్థిక, హార్దిక) ఉండడం వలన వాటి జోలికి రచయితలు వెళ్ళలేకపోతున్నారు. ప్రస్తుత పరి స్థితుల్లో రచయితలు తమ పుస్తకాలను తామే ప్రచురణ చేసుకునే ట్రెండ్ ఎక్కువైంది. నేను 1984లో 'దీపిక', 2016లో 'తడియారని దుఃఖం' కవితా సంపుటాలను నా మిత్రుల ప్రచురణ సంస్థల ద్వారా ప్రచురించాను. 2015లో వరంగల్ మిత్రులందరం కలిసి 'రుద్రమ' ప్రచురణ సంస్థను స్థాపించాము. ఆ సంస్థలో నేను సహసంపాదకు రాలిగా 7, 8 పుస్తకాలకు పని చేసాను. 2017లో రుద్రమ ప్రచురణల నుంచి నేను బయటకు వచ్చి, 2018లో హస్మిత ప్రచురణ సంస్థను స్థాపించాను. మొదట్లో నా పుస్తకాలను మాత్రమే ప్రచురించాను. తర్వాత రచనలను ముద్రించుకోవడంలో నానా అవస్థలు పడుతున్న రచయితలకు నా సంస్థ ద్వారా అవకాశం ఇస్తే బాగుంటుందన్న ఆలోచన వచ్చింది. అందులో భాగంగా 2023లో 'స్వయంసిద్ధ' ఒంటరి మహిళల జీవన గాథల పేరిట 40 మంది కొత్త, పాత రచయితలను కలుపుకొని వారితో కొత్త కథలు రాయించి ఒక కథా సంకలనాన్ని విజయవంతంగా తీసుకొని వచ్చాను. ఆ పుస్తకం ఏడాదిలోనే ద్వితీయ ముద్రణ కూడా వచ్చింది. అదే ఉత్సాహంతో ఇప్పుడు 'యోధ' మాతృత్వం భిన్నవ్యక్తీకరణల పేరిట తీసుకు వచ్చాను.

మాతృత్వం కాన్సెప్ట్ మీద కథా సంకలనం తీసుక రావాలన్న ఆలోచన ఎలా వచ్చింది?

ఒంటరి మహిళలుగా స్త్రీలు ఈ సమాజంలో ఎదుర్కొంటున్న అనేక సమస్యలను క్రోడీకరించి, వారి విజయ గాథలను 'స్వయం సిద్ధ' రూపంలో కథా సంకలనంగా తెచ్చాము. ఒంటరితనం తరువాత స్త్రీలు సమాజంలోను, కుటుంబంలోను ఎక్కువగా ఎదుర్కొనే ముఖ్య మైన సమస్య శారీరక హింస, అందులో ఒక భాగమే మాతృత్వం. ఆ హింసను పరోక్షంగా బలపరిచేది పితృస్వామిక వ్యవస్థ, దాని భావజాలం. ఆ భావజాలం స్త్రీలకు బానిసత్వాన్ని ఇంజెక్ట్ చేసింది. కుటుంబంలో తల్లి స్థానాన్ని గ్లోరిఫై చేస్తూ అనేక విధాలుగా స్త్రీలపై అధికారాన్ని మనువాదం స్థిరపరచుకుంది. ముఖ్యంగా స్త్రీలు మాతృత్వం పేరిట కుటుంబంలో అనేక రూపాల్లో వివక్ష, అణచివేత లతోపాటు వివిధ మానసిక, శారీరక హింసలకు లోనుకా వడం నన్ను బాగా కలవర పరచిన విషయం. మాతృత్వం అనేది ఒక భ్రమ మాత్రమే అనేది నా నమ్మకం. పితృ స్వామిక భావజాలం మాత్రం 'మాతృత్వం' అనే అంశాన్ని స్త్రీల చుట్టూ మెలికలు తిప్పుతూ అనేక కట్టుకథలను అల్లి, ఇంకా నమ్మించే ప్రయ త్నం చేయడం దురదృష్టకరం. మాతృత్వం స్త్రీలను జీవితాంతం నిద్ర పుచ్చే ఒక మత్తుమందు లాంటిది. దానిని గ్లోరిఫై చేయ డమే ఈ సమాజ ఉద్దేశం. అన్ని భావనల లాగా మాతృత్వం, తల్లితనం అనేది ఒక మానసిక భావన మాత్రమే అన్నది 80వ దశకం నుంచి స్త్రీవాదులు చేస్తున్న వాదనే. స్త్రీ పురుషుల సమానత్వం కోరుకుంటున్న సమాజ పరిణామ క్రమంలో వంటిల్లూ, పిల్లల బాధ్యతా కేవలం స్త్రీలదే అని వాదించడం మూర?త్వం. చలం ఏనాడో చెప్పాడు. స్త్రీకి మెదడు ఉంది, దానికి ఆలోచన ఉంటుంది అని. ఆ ఆలోచన లోంచి పుట్టిందే 'యోధ'. ముందుగా 'మాతృత్వం %-% విభిన్న కోణాలు' పేరిట ఒక అవగాహన సదస్సును ఏర్పాటు చేశాను. అందులో దాదాపు 70 మంది రచయిత్రులు పాల్గొన్నారు. ఆ సదస్సులో మాట్లాడిన వక్తల ఆలోచనల నుండి 70మంది రచయితలు కథలు రాశారు. అందులో 53 మంది రచయితల రచనలు మాత్రమే ఈ సంకలనంలో చోటు చేసుకున్నాయి.

మాతృత్వం కాన్సెప్ట్‌తో వచ్చిన కథా సంకలనానికి 'యోధ' అని పేరు పెట్టడంలో ఉద్దేశ్యం?

'యోధ' అంటేనే పోరాట పటిమ కలిగి ఉండడం. ప్రతి విషయం లోనూ పోరాటం తర్వాతే విజయం ఉంటుంది. ప్రతి మనిషి రోజువారీ జీవితంలో కూడా అనేక పోరాటాలు చేయాల్సి ఉంటుంది. అది హద్దుల కోసం కావచ్చు, హక్కుల కోసం కావొచ్చు, మరే విషయంలోనైనా కావచ్చు. అలాగే కుటుంబంలో ప్రతి స్త్రీ ఎన్నో పోరాటాలు చేస్తేనే అనుకున్నది సాధించగలుగుతుంది. శతాబ్దాలుగా స్త్రీలపై నిత్యం పడుతున్న అదనపు భారం మాతృత్వం. అమ్మ అనిపించుకుంటేనే ఆడజన్మ సార్థకం అన్న నానుడి, పితృస్వామిక భావజాలం కలగలిపి స్త్రీలను కుటుంబ వ్యవస్థలో కట్టు బానిసలుగా మార్చివేసాయి. ఆ బానిసత్వం వెనుక ఉన్న కుట్రలను చదువుకున్న నేటి ఆధునిక స్త్రీలు గుర్తెరిగారు. మాతృత్వం అన్న దానిలో ప్రత్యేకత ఏమీ లేదనీ, అన్ని అనుభూతుల లాగే అదీ ఒక అనుభూతి అనీ తెలుసుకున్నారు. సమాజంలోనూ కుటుంబం లోనూ పురుషులతో ఏ సమానత్వ హక్కునైతే ఈనాడు స్త్రీలు కోరుకుంటున్నారో, అదే సమాన బాధ్యతను పిల్లల పెంపకం, వారి ఆలనా పాలనా విషయంలో కూడా అడుగుతున్నారు. ఆడవాళ్ళ భ్రమలు తొలగిపోయి మాతృత్వం అనేది స్త్రీ పురుషులిద్దరూ కలిసి మోయాల్సిన బాధ్యత అని ఇప్పుడు ఎలుగెత్తి అంటున్నారు. మాతృత్వం మాటున దాగిన దగాకోరుతనాన్ని ఒకవైపు నిలదీస్తూ మరోవైపు అందులోని డొల్లతనాన్ని ప్రశ్నిస్తూ నిరంతరం పురుష స్వామ్యంతో పోరాడుతున్నారు. అందుకే వారిని నేను 'యోధ'లుగా చూస్తున్నాను. అందుకే 'యోధ' అనే పేరును మాతృత్వం భిన్న వ్యక్తీకరణలకు సూచనగా పెట్టాను.

ఎడిటర్
ఆర్ చైతన్య

## కేంద్ర బిజెపి ప్రభుత్వ రైతు. కార్మిక. ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించండి

సిఐటియు అమరచింత మండల కమిటీ ఆధ్వర్యంలో నవంబర్ 26న వనపర్తి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు జరిగే ధర్నా విజయవంతం చేయాలని కరపత్రాలను సిఐటియు నాయకులతో కలిసి పంపిణి చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఆర్.ఎన్. రమేష్ మాట్లాడుతూ. అనేక త్యాగాలు, రక్తపు మారకాలతో పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మారుస్తూ పార్లమెంటులో ఎలాంటి చర్చ జరగకుండా ఏకపక్షంగా బిజెపి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కార్మిక వర్గానికి గుదిబండలుగా మారుతున్నాయి. వేతనాల కోడ్ చట్టంతో కనీస వేతనాలు నిర్ణయించే మౌలిక విధానాన్ని తుంగలో తొక్కింది. శ్రామిక సంబంధాల కోడు చట్టంతో సమ్మె హక్కును కాల రాస్తున్నది. పని పరిస్థితుల కోడులతో పిఎఫ్ ఈఎస్ఐ వెల్ఫేర్ బోర్డులపై గొడ్డలి వేటు వేస్తున్నది. కార్మిక రైతు ప్రజా వ్యతిరేక కేంద్ర బడ్జెట్ను సవరించాలి. నాలుగు లేబర్ కోడ్స్, విద్యుత్ సవరణ బిల్లు 2022 రద్దు చేయాలి. 73 షెడ్యూల్ పరిశ్రమల జీవోలను సవరించి పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలి.. కాంట్రాక్టు విధానం రద్దుచేసి. కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ శాఖలలో ప్రభుత్వ రంగ సంస్థలలో ఖాళీలను వెంటనే భర్తీ చేయాలి..

# సీఎం రేవంత్‌రెడ్డికి రోజులు దగ్గరపడ్డాయి

మొదటిపేజీ తరువాయి

ఇవాళ మీరు పర్మిషన్ ఇవ్వకుంటే హైకోర్టుకు వెళ్లి పర్మిషన్ తెచ్చుకున్నామని అన్నారు. ఈ మహా ధర్నాకు వెయ్యి మంది అనుకుంటే 25 వేల మంది వచ్చారని.. అంటే ప్రభుత్వం మీద ఎంత కోపం, వ్యతిరేకత ఉందో ఈ మానుకోట మహాధర్నా చూస్తే అర్థమవుతోందని అన్నారు.

తెలంగాణ ఉద్యమంలో మానుకోట కీలకం

ఇదే మానుకోట 14 ఏళ్ల కిందట ఇదే మానుకోట తెలంగాణ ఉద్యమంలో ఓ కీలకమైన మలుపునకు కారణమైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మళ్లీ అదే మానుకోట ఇప్పుడు ఎస్సీ, ఎస్టీ, బీసీ భూములు గుంజుకుంటా ఏం చేసుకుంటారో చేసుకోండి అంటున్న కొత్త నియంతకు బుద్ధిచెప్పేందుకు సిద్ధమైందని తెలిపారు. అసలు ముఖ్యమంత్రి నియోజకవర్గం కొడంగల్‌లోని లగచర్లలో ఏం జరిగిందో ప్రజలు తెలుసుకోవాలని అన్నారు. లగచర్లలో ఉండే బీసీ, ఎస్సీ, ఎస్టీ రైతులు ఈ ముఖ్యమంత్రి మీద తిరగబడ్డారని కేటీఆర్ తెలిపారు.



వారి భూములను తీసుకుంటామని చెబితే మా ఆడబిడ్డలు 9 నెలల పాటు ధర్నా చేసి నిరసన తెలిపారని అన్నారు. 9 నెలలుగా సొంత నియోజకవర్గంలో ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు ఈ ముఖ్యమంత్రికి సమయం లేదని విమర్శించారు. కానీ ఎక్కే విమానం దిగే విమానం అన్నట్లుగా 28 సార్లు ఢిల్లీకి పోయిండు.. కనీసం 28 పైసలు కూడా తేలేదని ఎద్దేవా చేశారు. సొంత నియోజకవర్గంలో సీఎం రేవంత్ రెడ్డి మీద ప్రజలు తిరగబడుతున్నారని తెలిపారు. మొన్న అధికారులు పోతే ప్రజలు నిరసన తెలిపారు. కానీ రేవంత్ రెడ్డి పోయి ఉంటే ఉరికించి, ఉరికించి కొట్టేవారని అన్నారు. ఎందుకంటే ఢిల్లీలో రైతులు ఏడాది పాటు ఆందోళన చేసి మోదీ లాంటి వ్యక్తినే నల్ల చట్టాల నుంచి వెనక్కి తగ్గేలా చేశారని గుర్తుచేశారు. రైతుల పవర్ అంటే ఆ విధంగా ఉంటుందని.. అలాంటి పవర్ ఉన్న రైతులతో రేవంత్ రెడ్డి పెట్టుకున్నాడని మండిపడ్డారు.

ఫార్మా విలేజ్ ఎవరి కోసం.....

ఫార్మా విలేజ్ ఎవరి కోసమని కేటీఆర్ ప్రశ్నించారు. తన అల్లుడి కోసం రేవంత్ రెడ్డి పేదవాళ్ల భూములను గుంజుకుంటున్నాడని మండిపడ్డారు. ఈ ముఖ్యమంత్రి తన సొంత అల్లుడు, అదానీ, అన్నగాడు, తమ్ముని కోసం తప్ప రాష్ట్ర ప్రజల కోసం పని చేయడం లేదని విమర్శించారు. మరో 10 రోజులైతే రేవంత్ రెడ్డి పాలనకు ఏడాది అవుతుందని గుర్తుచేశారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామన్నారు. 420 హామీలు ఇచ్చారా? ఒక్క హామీనైనా నెరవేర్చారా? అని ప్రశ్నించారు. ఇక్కడున్న డోర్నకల్, మహబూబాబాద్ ఎమ్మెల్యేలు దీనికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

# అదానీ రూ.100 కోట్ల విరాళాన్ని తిరస్కరిస్తున్నాం

మొదటిపేజీ తరువాయి

రాజ్యాంగ బద్ధంగా, చట్టబద్ధంగానే అదానీ నుంచి పెట్టుబడులు అనుమతిస్తాం. నిబంధనల మేరకే టెండర్లు పిలిచి ప్రాజెక్టులు ఇస్తున్నాం. దేశంలో ఏ సంస్థలకైనా చట్టబద్ధంగా వ్యాపారం చేసుకొనే హక్కు ఉంటుంది. అంబానీ, అదానీ, టాటా.. ఎవరికైనా తెలంగాణలో వ్యాపారం చేసుకొనే హక్కు ఉంది. గొప్ప సంకల్పంతో లక్షలాది మంది నిరుద్యోగులకు సాంకేతిక నైపుణ్యం నేర్పించే లక్ష్యంతో స్కిల్స్ యూనివర్సిటీని ప్రారంభించాం. గొప్ప సదుద్దేశంతో ప్రారంభించిన ఈ వర్సిటీ వివాదాలకు లోను కావడం మంత్రివర్గ సహచరులకు, నాకు, ప్రభుత్వానికి ఇష్టంలేదు. అదానీ గ్రూప్ స్కిల్స్ వర్సిటీకి ఇచ్చిన విరాళాన్ని సీఎం, మంత్రులకు ఇచ్చినట్లు కొందరు ప్రచారం చేస్తున్నారు. సీఎస్ఆర్ కింద స్కిల్స్ వర్సిటీకి అదానీ గ్రూప్ ప్రకటించిన రూ.100 కోట్లు బదిలీ చేయొద్దని కోరుతూ ఆ గ్రూప్‌నకు లేఖ పంపాం. అనవసర వివాదాల్లోకి రాష్ట్ర ప్రభుత్వాన్ని లాగొద్దు. తెలంగాణ ప్రభుత్వ ఖాతాల్లోకి ఎవరి నుంచీ డబ్బులు రాలేదు" అని సీఎం అన్నారు.

### అవసరమైతే దిల్లీకి ఎన్నిసార్లైనా వెళ్తాం

"నేటి దిల్లీ పర్యటనకు రాజకీయాలతో సంబంధంలేదు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా కుమార్తె వివాహం కోసమే దిల్లీకి వెళ్తున్నాం. పార్లమెంటు సమావేశాలపై ఎంపీలతో మంగళవారం చర్చిస్తాం. అందుబాటులో ఉన్న కేంద్ర మంత్రులను రేపు కలిసి రాష్ట్ర సమస్యల్ని వివరిస్తాం. 28 సార్లు దిల్లీ వెళ్లానని కొందరు విమర్శిస్తున్నారు. నేను వారిలా పైరవీలు చేయడానికో.. బెయిల్ కోసం దిల్లీకి వెళ్లలేదు. కేంద్రం నుంచి మనకు రావాల్సినవి రాబట్టుకోవాలి. అవసరమైతే దిల్లీకి ఎన్నిసార్లయినా వెళ్తాం" అన్నారు.

### జైలుకెళ్లాలని కేటీఆర్ తహతహలాడుతున్నారు..

"బీఆర్ఎస్ సర్కారు అదానీకి గతంలో ఎన్నో ప్రాజెక్టులు ఇచ్చింది. అదానీతో బీఆర్ఎస్ సర్కారు అంటకాగింది. అదానీ వద్ద వాళ్లు కమీషన్లు తిన్నారు. కేటీఆర్ జైలుకు వెళ్లాలని తహతహలాడుతున్నారు. జైలుకెళ్తే సీఎం అవ్వొచ్చని అనుకొంటున్నారు. కేసీఆర్ కుటుంబం నుంచి ఇప్పటికే కవిత జైలుకు వెళ్లారు. జైలుకెళ్లినవారు సీఎం అయ్యేదుంటే ముందు కవిత అవుతారు. కేసీఆర్ కుటుంబంలో సీఎం సీటు కోసం పోటీ ఎక్కువగా ఉంది" అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

# ఆర్థిక క్రమశిక్షణతో ఒక్కో హామీ నెరవేరుస్తున్నాం: మంత్రి పొన్నం

మొదటిపేజీ తరువాయి

హుజూరాబాద్: మహారాష్ట్ర ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమిపాలైందని మాజీ మంత్రి హరీశ్‌రావు సంబర పడుతున్నారా? భాజపా గెలిచిందని సంతోషపడుతున్నారా? అని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రశ్నించారు. హుజూరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మంత్రి హాజరై మాట్లాడారు.

"తెరాసను భారాసగా పేరు మార్చారు. మహారాష్ట్రకు వందల కార్లలో వెళ్లి కనీసం పోటీ కూడా చేయలేకపోయారు. మేం మొదటి నుంచీ చెబుతున్నాం. భారాస, భాజపా దిల్లీలో దోస్తీ.. గల్లీలో కుస్తీలా వ్యవహరిస్తున్నాయి. ఇది మరోసారి నిరూపణ అయింది. అందుకే పార్లమెంటు ఎన్నికల్లో భారాస ఒక్క సీటు కూడా సాధించలేకపోయింది. ప్రతిదీ రాజకీయంగా ఆలోచిస్తే ప్రజాస్వామ్యం మనుగడకే ప్రమాదం. మొన్నటి వరకు పంట మొత్తం కాళేశ్వరం వల్లే అన్నారు. కాళేశ్వరం లేకున్నా ఎల్లంపల్లి నుంచి పొదుపుగా నీరు వాడుకొని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కూడా రాని పంట ఇప్పుడు వచ్చింది.. ప్రకృతి సహకరించింది.

రూ.20 వేల కోట్ల బకాయిలు చెల్లించాలని రైస్ మిల్లర్లకు చెప్పాం. ఇంకా ఎవరైనా ఉంటే ప్రభుత్వంతో మాట్లాడి బకాయిలు చెల్లించాలి. ధాన్యం కొనుగోళ్లలో కొంత ఆలస్యం అయినందుకు కల్లాల వద్దకు వచ్చి ప్రతిపక్ష నాయకులు ఇష్టారీతిన మాట్లాడారు. సన్న వడ్లకి రూ.500 బోనస్ ఇస్తున్నాం.. రాష్ట్రంలో ఎవరికైనా రాకపోతే చెప్పాలి. మాట మీద నిలబడి రూ.2 లక్షల రైతు రుణమాఫీ చేశాం. ఎవరికైనా రుణమాఫీ కాకపోతే వ్యవసాయ అధికారుల ద్వారా కుటుంబ నిర్ధరణ జరుగుతోంది. ప్రభుత్వం సమాచారం సేకరిస్తుంది. వారికి కూడా తప్పకుండా రుణమాఫీ చేసే బాధ్యత మా ప్రభుత్వానిదే.

ప్రజా పాలనలో మంత్రులు, ఎమ్మెల్యేలను ప్రజలు స్వేచ్ఛగా కలవగలుగుతున్నారు. మా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే చూస్తే రాష్ట్ర ఖజానా ఖాళీగా ఉంది. అయినా ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ ఒక్కో హామీని నెరవేరుస్తున్నాం. ఎన్నో ఇబ్బందులు ఉన్నా ఒకటో తేదీనే జీతాలు వస్తున్నాయి. 11 నెలల్లోనే ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నాం. గత పదేళ్లలో భాజపా, భారాస ఏం చేసిందో ప్రజలు గమనించాలి"అని మంత్రి పొన్నం అన్నారు.

# పట్నం నరేందర్‌రెడ్డి పిటిషన్‌పై హైకోర్టులో ముగిసిన వాదనలు.. తీర్పు రిజర్వ్

హైదరాబాద్: కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. లగచర్ల దాడి ఘటనలో బొంరాస్‌పేట పోలీసులు 3 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. ఒకే ఘటనపై వేర్వేరు కేసులు నమోదు చేయడాన్ని నరేందర్ రెడ్డి ఉన్నత న్యాయస్థానంలో సవాల్ చేశారు. ఈ నేపథ్యంలో వాదనల సందర్భంగా ఒకే సంఘటనపై వేర్వేరు కేసులు నమోదు చేయొద్దన్న సుప్రీంకోర్టు తీర్పులను పిటిషనర్ తరఫు న్యాయవాది ప్రస్తావించారు. కేసులకు సంబంధించిన వివరాలను ఏఏజీ రజనీకాంత్ కోర్టుకు తెలిపారు. దాడి ఆధారంగా పోలీసులు వేర్వేరు కేసులు నమోదు చేశారని చెప్పారు. ఇరువైపుల వాదనలు ముగియడంతో.. హైకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది.



## డైరెక్టర్ రాంగోపాల్ వర్మ అరెస్టుకు రంగం సిద్ధం

మొదటిపేజీ తరువాయి

ఈ విషయంలో ప్రకాశం జిల్లా మద్దిపాడు పీఎస్‌లో కేసు నమోదైంది. అయితే ఈ కేసులో పోలీసుల విచారణకు వర్మ డుమ్మా కొడుతూ వస్తున్నారు. ఈరోజు విచారణకు హాజరుకావాల్సి ఉండగా.. రాలేనంటూ లాయర్ ద్వారా పోలీసులకు సమాచారం పంపారు. దీంతో రంగంలోకి దిగిన ఒంగోలు పోలీసులు సరాసరి హైదరాబాద్‌లోని ఆర్జీవీ ఇంటికి వెళ్లారు. ఆయన్ని అరెస్ట్ చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ముందుగా ఈ కేసులో నవంబర్ 19 (మంగళవారం)న విచారణకు హాజరుకావాల్సి ఉండగా.. డుమ్మా కొట్టాడు. సినిమా షూటింగ్‌లో బిజీగా ఉండటం వల్ల విచారణకు రాలేనని ఒంగోలు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ బాబుకు వాట్సాప్‌లో రాంగోపాల్ వర్మ మెసేజ్ పెట్టాడు. విచారణకు సహకరిస్తానని, వారం రోజులు గడువు ఇవ్వాలని పోలీసులను కోరాడు. దీంతో పోలీసులు వర్మకు మరోసారి నోటీసులు జారీ చేశారు. సోమవారం విచారణకు హాజరుకావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. అయితే, ఈ సారి కూడా డుమ్మా కొట్టడంతో పోలీసులు నేరుగా వర్మ ఇంటికి వెళ్లారు.

## వేములవాడ రాజన్నకు పోటెత్తిన భక్తులు

మొదటిపేజీ తరువాయి

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. రాజన్న సన్నిధిలో కార్తిక దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు బారులు తీరడంతో గర్భాలయంలో ఆర్జిత, అన్న పూజల సేవలను అధికారులు రద్దు చేశారు. స్వామివారి దర్శనానికి 3 గంటలకుపైగా సమయం పడుతున్నది. భద్రాచలంలో గోదావరిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి.. నదిలో కార్తిక దీపాలు వదిలారు. అనంతరం సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. సోమవారం తెల్లవారుజామునే ఆలయాలకు చేరుకున్న భక్తులు.. కార్తిక దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. గరళకంఠుడిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కాగా, నవంబర్ 2న ప్రారంభమైన కార్మిక మాత్రం ఈ వారంతో ముగియనుంది. ఈ నేపథ్యంలో కార్మిక మాస చివరి సోమవారం కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయాలకు తరలివచ్చారు.

## కామారెడ్డి డిక్లరేషన్‌ను యథాతథంగా అమలు చేయాలి: ఎమ్మెల్సీ కవిత

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: బీసీ రిజర్వేషన్లకు సంబంధించి కామారెడ్డి డిక్లరేషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం యథాతథంగా అమలు చేయాలని భారాస ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఇప్పటికే అనేక బీసీ సంఘాలు, మేధావులు ఇచ్చిన సూచనలు అమలుకు నోచుకోలేదన్నారు. హైదరాబాద్‌లో డెడికేటెడ్ కమిషన్ ఛైర్మన్ బుసాని వెంకటేశ్వరరావుకు ఆమె వినతిపత్రం అందజేశారు. అనంతరం కవిత మీడియాతో మాట్లాడారు.

"కాంగ్రెస్ ప్రభుత్వం 11 నెలలు తాత్సారం చేసింది. డెడికేటెడ్ కమిటీ స్వతంత్రంగా పనిచేయాలి. ప్రత్యేక కార్యాలయం, మానవ వనరులు, సామగ్రి ఇవ్వకుంటే ఆ కమిటీ ఎలా పనిచేస్తుంది?కులగణనపై నెల రోజుల్లో నివేదిక అంటే ఎన్నో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనికి చట్టబద్ధత కల్పించాలి. రిజర్వేషన్ల అంశంపై కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పాలి. హైదరాబాద్‌లో ఇప్పటికీ 70 శాతం స్టిక్కర్ వేయని ఇళ్లు ఉన్నాయి. 90 శాతం సర్వే పూర్తయిందని ప్రభుత్వం చెబుతోంది. డేటా కంప్యూటరీకరణ చేశారా?" అని కవిత ప్రశ్నించారు.

## జీహెచ్ఎంసీలో హౌసింగ్ సొసైటీలకు భూకేటాయింపులు రద్దు చేసిన సుప్రీంకోర్టు

దిల్లీ: జీహెచ్ఎంసీ పరిధిలో హౌసింగ్ సొసైటీలకు భూకేటాయింపులను సుప్రీంకోర్టు రద్దు చేసింది. ప్రజాప్రతినిధులు, అధికారులు, జర్నలిస్టుల సొసైటీలకు గతంలో ప్రభుత్వాలు భూకేటాయింపులు చేశాయి. వీటిని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈక్రమంలో విచారణ చేపట్టిన సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని ధర్మాసనం తుది తీర్పు వెలువరించింది. ప్రభుత్వానికి సొసైటీలు కట్టిన డబ్బులు వెనక్కి ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది.

# ఒప్పంద ఉద్యోగుల వేతన ఖాతాలు తెరవడానికి సహకరించండి

**కరపత్రం రామగిరి ప్రతినిధి నవంబర్ 25**
రామగుండం-3 ఏరియాలోని వివిధ గనులు, విభాగాలలో పనిచేస్తున్న కాంట్రాక్టర్ల ఉద్యోగులకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించేందుకు సింగరేణి సంస్థ యాజమాన్యం, హెచ్.డి.ఎఫ్.సి. బ్యాంకు మధ్య కుదిరిన ఒప్పందం మేరకు కాంట్రాక్టర్లు తమ వద్ద పని చేస్తున్న ఉద్యోగులచే హెచ్.డి.ఎఫ్.సి. వేతన ఖాతాలు తెరిపించి, ఉద్యోగుల నెలసరి వేతనాలు ఆ ఖాతాలలో జమ చేయడంలో కాంట్రాక్టర్లకు, ఒప్పంద ఉద్యోగులకు సహకారం అందించాలని హెచ్.డి.ఎఫ్.సి. బ్యాంకు మేనేజర్లను రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు కోరారు. వేతన ఖాతాలు తెరిపించడానికి ప్రత్యేకంగా పర్సనల్ విభాగం అధికారి గుర్రం శ్రీహరి ని నోడల్ ఆఫీసర్ గా నియమించామని, కాంట్రాక్టర్లు ఖాతాలు తెరవడంలో ఏవైనా ఇబ్బందులు తలెత్తితే వారిని సంప్రదించాలని సూచించారు. సోమవారం నాడు జి.యం. కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో వివిధ గనులు, విభాగాలలో పనిచేస్తున్న కాంట్రాక్టర్లు, సంబంధిత విభాగాధిపతులతో నిర్వహించిన సమావేశానికి హాజరైన హెచ్.డి.ఎఫ్.సి. బ్యాంకు గోదావరిఖని, మంథని బ్రాంచ్ మేనేజర్లు విద్యాసాగర్, శ్రీకాంత్ లు వివిధ కాంట్రాక్టర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ సమావేశంలో వివిధ విభాగాల కాంట్రాక్టర్లు మాట్లాడుతూ వారి కరెంటు అకౌంట్లు తెరవడానికి బ్యాంకులో సంప్రదించినప్పుడు సంబంధిత బ్యాంకు సిబ్బంది సహకరించట్లేదని వాపోయారు. అదేవిధంగా జీతాలు ఉద్యోగుల ఖాతాల్లో జమ చేయడానికి కనీసంగా మూడు రోజులు తీసుకుంటున్నారని అన్నారు. తదుపరి బ్యాంకు మేనేజర్లు వారి దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని, ముందు ఏవైనా సమస్యలు ఎదురైతే వారిని సంప్రదిస్తే తక్షణమే స్పందించి పరిష్కారం చూపుతామని తెలిపారు. అంతే కాకుండా సంబంధిత అధికారులు గాని కాంట్రాక్టర్లు గానీ ముందుగా తెలియజేస్తే వారి వద్దకే బ్యాంకు సిబ్బందిని పంపించి ఖాతాలు తెరిపించేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సంబంధిత అధికారులు మాట్లాడుతూ కాంట్రాక్టర్లు వారి కరెంటు అకౌంట్లు, ఉద్యోగుల వేతన ఖాతాలు సులభతర పద్ధతిలో తెరిపించేలా హెచ్.డి.ఎఫ్.సి. బ్యాంకు సిబ్బంది సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్వోటుజియం జి.రఘుపతి, ప్రాజెక్ట్ ఆఫీసర్ రమేశ్, విభాగాధిపతులు రాజేంద్రకుమార్, సుదర్శనం, కళ్యాణ్ అధికారులు గుర్రం శ్రీహరి, మురళి, సాయి కృష్ణ, బ్యాంకు ప్రతినిధి ప్రభాకరన్, వివిధ విభాగాల కాంట్రాక్టర్లు, బ్యాంకు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం.. అర్హులందరికీ సంక్షేమ పథకాలు...

**- 105 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ**
**- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రమణారెడ్డి...**

**కరపత్రం శంకర పట్నం నవంబర్ 25**
తెలంగాణ రాష్ట్రంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి రాష్ట్ర మంత్రివర్గం ఎమ్మెల్యేలు ప్రజా ప్రభుత్వాన్ని కొనసాగిస్తూ అర్హులైన పేదవారికి సంక్షేమ పథకం అందజేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ తిమ్మాపూర్ మండలాధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి అన్నారు. సోమవారం కరీంనగర్ జిల్లా, తిమ్మాపూర్ మండలం, ఎల్ఎండీ కాలనీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ప్రజా భవన్ లో తిమ్మాపూర్ మండలానికి చెందిన 105 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులతోపాటు 20 మందికి కళ్యాణ లక్ష్మీ చెక్కులను పంపిణీ చేశారు. మండల అభివృద్ధి అధికారి విజయ్ కుమార్, డిప్యూటీ తహసీల్దార్ కె.లక్ష్మణ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మానవీయ కోణంలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సహాయాలను అందిస్తోందన్నారు. నిరుపేద కుటుంబాలకు ఆ సాయం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా లబ్ధిదారులకే నేరుగా చెక్కులు అందజేస్తున్నామని, నియోజకవర్గంలో ఎక్కువ మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి ఆర్థిక సహాయం సత్వరం అందించే విధంగా కృషి చేస్తున్న మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తాజాగా105 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ కింద 24.85 లక్షల రూపాయల ఆర్థిక సహాయ మొత్తాలను చెక్కుల రూపంలో అందించడం జరిగిందన్నారు. ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా వృద్ధిలోకి రావాలని రమణారెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధగోని లక్ష్మినారాయణ గౌడ్, జిల్లా పార్టీ కార్యాలయ ఇంచార్జీ గోపు మల్లారెడ్డి, పార్టీ నాయకులు బండారి రమేశ్, చింతల లక్ష్మారెడ్డి, గవ్వ రాజేందర్ రెడ్డి, మాచర్ల అంజయ్య, పోలు రాము, రమేశ్, రెడ్డిగాని రాజు, గుంటి మల్లేశం, రాములు యాదవ్, దివాకర్, ప్రభాకర్, ఆశిక్ పాషా, బుడిగె సంపత్, వంగల కిషన్ రెడ్డి, గొట్టిముక్కుల సంపత్ రెడ్డి, కుమార్, కొత్తపల్లి రాయమల్లు, గోదారి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.





# రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ పై విద్యార్థులకు అవగాహన..

**- మల్లారెడ్డి యూనివర్సిటీ అగ్రికల్చర్ సైన్సెస్ విద్యార్థులు..**

**కరపత్రం ప్రతినిధి,వీణవంక,నవంబర్ 25.**
వీణవంక మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో సోమవారం మల్లారెడ్డి యూనివర్సిటీ (స్కూల్ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్) రిచిత మాట్లాడుతూ... రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ అనేది గృహాలకు నీటి స్వీయ-సరఫరా యొక్క సరళమైన పురాతన పద్ధతుల్లో ఒకటి. రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ అనేది సహజ జలాశయాలు , ట్యాంకుల్లోకి వర్షపు నీటిని సేకరించడం, నిల్వ చేయడం జరుగుతుంది. అది అవసరమైనప్పుడు ఉపయోగించే ప్రక్రియ. ఈ వ్యవస్థను రెండు ప్రధాన విధాలుగా అమలు చేయవచ్చు,రూఫ్ టాప్ వర్షపు నీటి సేకరణ ఇది. భవనాల నుండి వర్షపు నీటిని సేకరించి , వడపోత ద్వారా నిల్వ చేయడం. మూల ప్రదేశాల నుంచి నీటి సేకరణ వర్షపు నీటిని పునః సమీక్షించి, చెరువులు,కుంటలు వంటి స్థలాలలో నిల్వ చేయడం. సేకరించిన నీటిని వ్యవసాయానికి,గృహ అవసరాలకు, కొంతమంది శుద్ధీకరించి పానీయంగా ఉపయోగించుకుంటారు. అందుకే ప్రభుత్వం ఇంకుడు గుంతలను తవ్వాల ని , వాటి ద్వారా భూగర్భ జలాలు కూడా అభివృద్ధి పొందుతాయనే ఉద్దేశంతో ప్రభుత్వం , ప్రతి ఇంటికి ఒక ఇంకుడు గుంత ఉండాలనీ ప్రభుత్వం కొన్ని కార్యక్రమాలు కూడా చేపట్టడం జరిగింది .నీటి సేకరణతో నీటి వాడకాన్ని తక్కువ చేస్తూ, భూమి క్రింద ఉన్న నీటిని కూడ రక్షించుకోవచ్చు. అలాగే వర్షపు నీటిని సేకరించడం వలన వరదల పై నియంత్రణ, నీటి నిల్వ పెరిగే అవకాశాలు ఉంటాయి అని అన్నారు . ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పులి అశోక రెడ్డి , మల్లారెడ్డి యూనివర్సిటీ స్టూడెంట్స్ మేరీ, ప్రజ్ఞ , షారోన్ , పద్మజ రెడ్డి , మానస, నీలిమ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.




# కానిస్టేబుల్ గా ఎంపికైన ముత్యాల ప్రవళికకు ఘనంగా సన్మానం...

**- కనపర్తి గ్రామ మహకళ వంశీయులు...**

**కరపత్రం ప్రతినిధి,వీణవంక, నవంబర్ 25.**
వీణవంక మండలం కనపర్తి గ్రామానికి చెందిన ముత్యాల పద్మ- హుస్సేన్ దంపతుల పుత్రిక ముత్యాల ప్రవళిక కానిస్టేబుల్ గా ఎంపికై, కనపర్తి గ్రామానికి పేరు తెచ్చిన ,శుభ సందర్భంగా కనపర్తి గ్రామ మహకళ వంశీయులు సోమవారం శివాలయ ఆవరణలో ముత్యాల ప్రవళికను శాలువా కప్పి, ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మహకళ మహేందర్ రెడ్డి, దామోదర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, జైపాల్ రెడ్డి, సదాశివరెడ్డి, రాంగోపాల్ రెడ్డి, కిషన్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, శ్యాంసుందర్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, గోపాల్ రెడ్డి, రజనీకర్ రెడ్డి తో పాటుగా , ప్రవళిక కుటుంబ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.



# తైక్వాండో పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన మోడల్ స్కూల్ విద్యార్థి బి హరీష్..



**కరపత్రం ప్రతినిధి,వీణవంక, నవంబర్ 25.**
వీణవంక మండలం ఘన్ముక్ల ఆదర్శ పాఠశాల విద్యార్థి బి. హరీష్ ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవల సంగారెడ్డి జిల్లాలో నిర్వహించిన ఎస్. జి. ఎఫ్ అండర్ 19 బాలుర రాష్ట్రస్థాయి తైక్వాండో విభాగంలో పాల్గొని ప్రథమ బహుమతి గెలిచి,జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై డిసెంబర్లో మధ్యప్రదేశ్ లో జరిగే జాతీయస్థాయి పోటీలో పాల్గొననున్నాడు. ఈ సందర్భంగా క్రీడల్లో ప్రతిభ చూపించిన విద్యార్థి బి హరీష్ ను ప్రిన్సిపాల్ మోయిజ్ బేగ్,ఎస్.జి.ఎఫ్ సెక్రటరీ మధుజాన్సన్, కోచ్ సంపత్, పిడి షబ్బీర్ పాష, ఉపాధ్యాయులు అభినందించారు.

# సెపక్ తక్రా ఉపాధ్యక్షునికి సన్మానం



**కరపత్రం రామగిరి ప్రతినిధి, నవంబర్ 25.**
సెపక్ తక్రా అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షునిగా ఎంపికైన పూదరి సత్యనారాయణ గౌడ్ ను సోమవారం బీఆరెస్ మండల నాయకులు శాలువా పూలమాలతో సత్కరించారు. రాబోయే రోజుల్లో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు. మండల బీఆరెస్ అధ్యక్షుడు శెంకేషి రవీందర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సన్మాన కార్యక్రమంలో రాష్ట్ర బీఆరెస్ యువజన నాయకుడు జక్కు రాకేష్, బీఆరెస్ పట్టణ అధ్యక్షుడు కాపురవేన భాస్కర్, నాయకులు బుర్ర శంకర్ గౌడ్, రొడ్డ శ్రీనివాస్, ఎండీ. ఇబ్రహీం, మట్ట రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర కమిటీ కార్యదర్శికి సన్మానం



**కరపత్రం రామగిరి ప్రతినిధి, నవంబర్ 25.**
కేంద్ర కమిటీ కార్యదర్శకునిగా ఎన్నికైన ఎల్లంకి రామారావు ను ఓసిపి 2 డీజిల్ బుజర్ సెక్షన్ కార్మికులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గెల్లి కుమార్, శ్రీనివాస్ రెడ్డి, కిరణ్, అజయ్ కార్మికులు పాల్గొన్నారు.

# బాలికలను చదివించండి.. మహిళ సాధికారతను సాధించండి...



**కరపత్రం ప్రతినిధి, వీణవంక, నవంబర్ 25.**
వీణవంక మండలం చల్లూరు గ్రామంలో ఒకటవ అంగన్వాడి సెంటర్లో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహిళా సాధికారిక కేంద్రం మహిళలకు బాలింతలకు గర్భిణీలకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా మహిళా సాధికారిక కేంద్రం జెండర్ స్పెషలిస్టులు శైలజ, కవిత మాట్లాడుతూ... బాలికల పట్ల వివక్షత చూపరాదని, లింగ నిర్ధారణ పరీక్షలు చేయించుకొని, అబార్షన్ చేయించుకోవాలని ఒత్తిడి తీస్తే 1098 నెంబర్ కి కాల్ చేయాలని తెలియజేశారు. అలాగే గర్భిణీలకు బాలింతలకు పోషకాహారం ప్రాముఖ్యత గురించి వివరించారు. తెలియజేశారు.డి.హెచ్.ఈ.డబ్ల్యు సేవలు, బాల్య వివాహ నిషేధ చట్టం, గృహహింస చట్టం, వరకట్న నిషేధ చట్టం, సోషల్ మీడియా పట్ల జాగ్రత్తగా ఉండాలని, మహిళలు ఆపద సమయంలో ఉమెన్ హెల్ప్ లైన్ 181, చైల్డ్ హెల్ప్లైన్ 1098, వృద్ధుల హెల్ప్ లైన్ 14567, సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నెంబర్ 1930, ఉపయోగించుకోవాలని తెలిపారు.అదే విధంగా మహిళలు ప్రభుత్వ పథకాలను ఉపయోగించుకొని ముందుకు వెళ్లాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్ ,తాంద్రసారమ్మ,,కలకుంట్ల జ్యోతి.. రామిడి రమ, ఆశ కార్యకర్త గాలిపెల్లి రజిత గ్రామ సమైక్య అధ్యక్షురాలు సార్ల లలిత, గర్భిణీలు,బాలింతలు తదితరులు పాల్గొన్నారు.



# తను ఎవరో అందరికీ తెలుసు..

## రిలేషన్‌షిప్‌పై రష్మిక మందన్న

టాలీవుడ్‌లో మోస్ట్ క్రేజీయెస్ట్ కాంబోలో టాప్‌లో ఉంటుంది విజయ్ దేవరకొండ -రష్మిక మందన్నా. గీతగోవిందం, డియర్ కామ్రేడ్ సినిమాలతో సిల్వర్ స్క్రీన్‌పై మెరిసిన ఈ ఇద్దరు ఆఫ్ స్క్రీన్‌లో కూడా సూపర్ బాండింగ్ మెయింటైన్ చేస్తుంటారని తెలిసిందే. ఎప్పటికప్పుడు కలిసి కనిపిస్తూ నెట్టింట హాట్ టాపిక్‌గా నిలుస్తుంటారు. ఈ ఇద్దరు రిలేషన్‌షిప్‌లో ఉన్నారని చాలా కాలంగా నెట్టింట చర్చ నడుస్తుంది. అయితే దీనిపై మాత్రం అటు రష్మికకానీ, ఇటు విజయ్ దేవరకొండ కానీ సస్పెన్స్ మెయింటైన్ చేస్తూ వస్తున్నారు. అభిమానుల్లో నెలకొన్న డైలామాకు రష్మిక మందన్నా చెక్ పెట్టేసింది. చెన్నైలో జరిగిన పుష్ప 2 వేడుకలో తన రిలేషన్ షిప్ స్టేటస్‌పై ఓపెన్ అయిపోయింది కన్నడ సోయగం. మీకు ఇష్టమైన వ్యక్తి ఎవరు..? అతడు ఇండస్ట్రీ చెందిన వాడేనా..? అని యాంకర్ అని అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ.. అతడెవరో అందరికీ తెలుసునని చెప్పింది. రష్మిక సమాధానంతో ఆడిటోరియం అంతా అరుపులు,కేకలతో దద్దరిల్లిపోయింది. విజయ్ దేవరకొండతో ఉన్న రిలేషన్‌షిప్‌పై చాలా కాలంగా నెలకొన్న సస్పెన్స్‌కు తాజా కామెంట్స్‌తో ఫుల్ స్టాప్ పెట్టేసింది రష్మికమందన్నా. మరోవైపు ఇటీవలే తాను డేటింగ్‌లో ఉన్నానని, ఇప్పుడు తన వయస్సు 35 ఏండ్లు. ఇంకా సింగిల్‌గా ఉండమంటారా..? అందరం ఏదో ఒకటైంలో పెళ్లి చేసుకోవాల్సిందే..అంటూ రిలేషన్‌షిప్ గురించి హింట్ ఇచ్చేశాడు విజయ్ దేవరకొండ. ఈ లెక్కన త్వరలోనే విజయ్ దేవరకొండ, రష్మిక మందన్నా పెండ్లిపై క్లారిటీ వచ్చే అవకాశాలు లేకపోలేదంటున్నారు సినీ జనాలు.

# హిందీలో ఎన్టీఆర్‌కు

## రెండో సినిమా

జూనియర్ ఎన్టీఆర్ యాక్షన్ డ్రామా ప్రాజెక్ట్ వార్ 2తో బాలీవుడ్ ఎంట్రీ ఇస్తున్న విషయం తెలిసిందే. అయాన్ ముఖర్జీ డైరెక్షన్‌లో హృతిక్ రోషన్ మరో లీడ్ రోల్‌లో నటిస్తోన్న ఈ చిత్రం షూటింగ్ దశలో ఉంది. కాగా ఈ సినిమా విడుదల కాకముందే తారక్ మరో హిందీ సినిమాకు సంతకం చేశాడన్న వార్త నెట్టింట వైరల్ అవుతోంది. తాజా టాక్ ప్రకారం యశ్ రాజ్ ఫిలిమ్స్‌తో తారక్ మరో భారీ సినిమా కోసం చర్చలు జరుపుతున్నాడని బీటౌన్ సర్కిల్‌లో ఓ వార్త హాట్ టాపిక్‌గా మారింది. ప్రముఖ బాలీవుడ్ దర్శకుడు చెప్పిన కథ తారక్‌కు నచ్చిందట. అన్నీ అనుకున్నట్టుగా కుదిరితే 2025 చివరలో ఈ సినిమా లాంచ్ కాబోతుందట. ప్రస్తుతానికి ఆ డైరెక్టర్ ఎవరనేది సస్పెన్స్ నెలకొంది. యశ్ రాజ్ ఫిలిమ్స్ తరచూ స్టార్ యాక్టర్లలో మూడు సినిమాల ఒప్పందం కుదుర్చుకుంటుందని తెలిసిందే. మరి ఎన్టీఆర్ కూడా ఇలాంటి అగ్రిమెంట్‌కు సంతకం ఏమైనా చేశాడా..? అన్నది తెలియాల్సి ఉంది. మొత్తానికి ఏదేమైనా తారక్ త్వరలో హిందీలో రెండో సినిమాకు సైన్ చేసేందుకు రెడీ అవుతున్నాడన్నది మాత్రం నిజమేనని తాజా వార్తలు క్లారిటీ ఇచ్చేస్తున్నాయి. ఆర్ఆర్ఆర్‌తో గ్లోబల్ స్టార్ డమ్ సంపాదించుకున్న తారక్ ఇక హిందీలో కూడా తన సత్తా చూపించాలని డిసైడ్ అయినట్టు తాజా న్యూస్ హింట్ ఇచ్చేస్తుంది.



# లేట్ విషయంలో నేనేం చేయలేను : దేవీశ్రీ ప్రసాద్



సినీ ఇండస్ట్రీలో కొన్ని కాంబినేషన్స్‌కు ప్రత్యేకమైన క్రేజ్ ఉంటుంది. కొన్ని కాంబోల్లో సినిమా వస్తుందంటే చాలు బాక్సాఫీస్ రికార్డుల గురించే అంతటా చర్చ నడుస్తుంటుంది. అలాంటి జాబితాలో టాప్‌లో ఉంటుంది మైత్రీ మూవీ మేకర్స్-సుకుమార్-దేవీ శ్రీ ప్రసాద్ కాంబినేషన్. ఈ ముగ్గురి కాంపౌండ్ నుంచి వచ్చిన సినిమాలు బాక్సాఫీస్ వద్ద వసూళ్ల వర్షం కురిపించాయని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. అయితే పుష్ప 2 ది రూల్ సినిమా విషయంలో మాత్రం వీరి మధ్య మనస్పర్థలు వచ్చాయని టాక్ నెట్టింట వినిపిస్తూనే ఉంది. దీనిక్కారణం ఈ సారి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ విషయంలో డీఎస్పీతోపాటు మరికొందరు సంగీత దర్శకులకు ఇవ్వడమనేది అంతటా నడుస్తున్న చర్చ. ఈ విషయం నిజమేనని పుష్ప 2 ది రూల్ సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో మరోసారి తేలిపోయింది. ఈవెంట్‌కు దేవి శ్రీ ప్రసాద్ కాస్త ఆలస్యంగా వచ్చాడు. ఈ విషయాన్ని నిర్మాతల్లో ఒకరైన నవీన్ యేర్నేని డీఎస్పీని అడిగారు. దీంతో స్టేజ్‌పైనే తన సహనాన్ని నవ్వుతూ బయటపెట్టేశాడు దేవీ శ్రీ ప్రసాద్. పాటలు లేటని, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ లేటని తనను అంటూనే ఉంటారని,. ఇప్పుడు కూడా ఫంక్షన్‌కు ఆలస్యంగా వచ్చానని ఫీలయ్యారని, ఈ విషయంలో తననేం చేయమంటారని తనదైన స్టైల్‌లో చురకలంటించాడు డీఎస్పీ. ఎవరూ క్రెడిట్ ఇవ్వరని, తీసుకోవాల్సిందేనని, అది పేమెంట్ అయినా, స్క్రీన్‌పై క్రెడిట్ అయినా తప్పదన్నాడు దేవీ శ్రీ ప్రసాద్. టైంకు పాట ఇవ్వలేదు.. టైంకు బ్యాక్ గ్రౌండ్ స్కోర్ ఇవ్వలేదు. టైంకు ప్రోగ్రామ్ రాలేదని ఎక్కువ కంప్లైట్స్ చేస్తూ ఉన్నాయి. మీకు నా మీద ప్రేమ ఉంది. ఆ ప్రేమ ఉన్నప్పుడు కంప్లైంట్స్ కూడా ఉంటాయన్నాడు డీఎస్పీ. పుష్ప 2 డిసెంబర్ 5న విడుదలవుతున్న నేపథ్యంలో బ్యాక్ గ్రౌండ్ స్కోర్ పూర్తి కాలేదని.. సుకుమార్ అండ్ టీం అదనంగా ఎస్ థమన్, అజనీష్ లోక్‌నాథ్, శ్యామ్ సీఎస్‌ను తీసుకోవడం డీఎస్పీకి నచ్చలేదని నెటిజన్లు, మూవీ లవర్స్ చర్చించుకుంటున్నారు. మరి సినిమా విడుదల నేపథ్యంలో ఎలాంటి ప్రభావం పడకుండా డీఎస్పీ, నిర్మాతలు రాజీకి వస్తారా..? అనేది చూడాలి.

# ఆ బాధ నుంచి బయటకు వచ్చేందుకు చికిత్స తీసుకున్నా..

'లైగర్' తో తెలుగువారికి సుపరిచితమైన బాలీవుడ్ నటి అనన్యపాండే. తాజాగా ఆమె ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. కెరీర్ ఆరంభంలో తాను ఎంతో బాధపడ్డానని అన్నారు. ఆ బాధ నుంచి కోలుకునేందుకు చికిత్స తీసుకున్నానని చెప్పారు.తాను థెరపీ తీసుకున్నట్లు వస్తోన్న వార్తలపై స్పందిస్తూ.. "అవును. గతంలో చికిత్స తీసుకున్నా. అంతకు ముందులా ఇప్పుడు రెగ్యులర్‌గా తీసుకోవడం లేదు. కెరీర్ ఆరంభంలో ఎంతో నెగటివిటీ ఎదుర్కొన్నా. ఎన్నో విమర్శలు చూశా. వాటి వల్ల తీవ్రంగా బాధపడ్డా. భావోద్వేగాలను నియంత్రించుకోలేకపోయేదాన్ని. ఆత్మవిశ్వాసం కోల్పోయి.. కుంగుబాటుకు లోనయ్యా. కొన్ని సందర్భాల్లో మనం సోషల్‌మీడియాలో వచ్చిన కామెంట్స్ చదువుతుంటాం. ఆ సమయంలో అవి మనల్ని పెద్దగా ప్రభావితం చేయవు. కానీ, కొంతకాలం తర్వాత అవే కామెంట్స్ మనకు గుర్తుకు వస్తుంటాయి. ఇబ్బంది పెడుతుంటాయి. నా విషయంలో అదే జరిగింది. అందుకే థెరపీ తీసుకున్నా. దానివల్ల నా ఆలోచనా విధానం మెరుగుపడింది" అని చెప్పారు.కెరీర్ ఆరంభంలో ఎదురైన విమర్శల గురించి మాట్లాడుతూ.. "స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్ 2'తో పరిశ్రమలోకి అడుగుపెట్టా. ఇండస్ట్రీలోకి వచ్చిన కొత్తలో నా గురించి ఏవేవో వార్తలు వస్తుండేవి. వాటిలో ఒకటి నన్నెంతో ఇబ్బందిపెట్టింది. ఎవరో గుర్తు తెలియని వ్యక్తి ఇన్‌స్టాలో ఒక ఫేక్ అకౌంట్ క్రియేట్ చేసుకుని.. తను నాతో చదువుకున్నట్లు పోస్టులు పెట్టాడు. కాలేజ్, స్కూల్ గురించి నేను ఇంటర్వ్యూల్లో అబద్ధాలు చెబుతున్నానని అన్నాడు. ఆ పోస్టులు చూసి.. వీటిని ఎవరూ పట్టించుకోరనుకున్నా. కానీ వాటిని కూడా ప్రేక్షకులు చూస్తుంటారని ఆ తర్వాతే అర్థమైంది. ఇప్పుడున్న రోజుల్లో సోషల్‌మీడియాలో ఉండాలంటే భయమేస్తోంది. మనం ఏం మాట్లాడినా ప్రపంచానికి తెలిసిపోతుంది" అని పేర్కొన్నారు. అనన్య ప్రస్తుతం 'శంకర' అనే సినిమా కోసం వర్క్ చేస్తున్నారు.థెరపీ గురించి ఇటీవల బాలీవుడ్ నటుడు ఆమిర్ ఖాన్ కూడా స్పందించారు. థెరపీ కారణంగా తన కుమార్తె ఐరాతో బంధం మరింత బలపడిందన్నారు. థెరపిస్ట్‌ను కలవడానికి ఎవరూ ఇబ్బందిపడాల్సిన అవసరం లేదని చెప్పారు. "మనదేశంలో చాలామంది థెరపిస్ట్‌ను కలవడానికి వెనకడుగు వేస్తారు. దానికి కారణాలెన్నో ఉంటాయి. థెరపిస్ట్‌ను కలిశానని ఇతరులకు తెలిస్తే.. వారి మానసిక ఆరోగ్యం బాగాలేదని తెలిసిపోతుందని అందరూ ఆలోచిస్తారు. అలాంటివాటిని పక్కనపెట్టడం మంచిదని నా ఉద్దేశం" అని చెప్పారు.

